andhrajyothy.com
ఆంధ్రజ్యోతి



వీడని వాన



పెంబి మండలంలోని దొత్తివాగును దాటుతున్న గిరిజనులు

- జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షం
- ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు
- మారుమూల గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ప్రాజెక్ట్‌ల్లోకి స్వల్పంగా వచ్చి చేరుతున్న వరద నీరు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన ఎస్పీ

నిర్మల్ చైన్‌గేట్ రూరల్ / పెంబి రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : బంగాళఖాతంలో ఏర్పడ్డ తుఫాను కారణంగా జిల్లాలో గత ఐదారు రోజుల నుంచి క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. పెంబి మండలంలోని దోత్తి, కడెం వాగులు పొంగి ప్రవహించడంతో దాదాపు పదిహేను మారుమూల గిరిజన గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. దీంతో గిరిజన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో గురువారం నమోదైన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లా సగటు వర్షపాతం 27.2 మిల్లీమీటర్లుగా నమోదు కాగా జిల్లాలో అత్యధికంగా సారంగాపూర్ మండలంలో 38.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన కడెం, స్వర్ణప్రాజెక్టుల ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటిప్రవాహం కొనసాగుతోంది. దీంతో కడెం, స్వర్ణప్రాజెక్టుల వరద గేట్లను ఎత్తి దిగువన ఉన్న వాగుల్లోకి నీటిని వదులుతున్నారు. స్వర్ణప్రాజెక్టును జిల్లా ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల సందర్శించారు. అలాగే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లన్ని బురదను తలపిస్తుండడంతో రోడ్లపై గుంతలు ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనం ఇంటికే పరిమితమయ్యారు.

కడెం, స్వర్ణ ప్రాజెక్టుల వరద గేట్ల ఎత్తివేత

జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన కడెం, స్వర్ణప్రాజెక్టులకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి చేరుతున్న వరదనీటితో క్రమేపి ప్రాజెక్టుల నీటిమట్టం పెరుగుతోంది. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 7.603 టీయంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 5.755 టీయంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 14,633 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో అధికారులు అప్రమత్తమై రెండు వరదగేట్లను ఎత్తి దిగువన ఉన్న గోదావరిలోకి 7051 క్యూసెక్కుల వరద నీటిని వదులుతున్నారు. అలాగే జిల్లాలోని స్వర్ణ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.484 టీయంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1.183 టీయంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి 2700 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. అధికారులు అప్రమత్తమై ఒక వరద గేటును ఎత్తి దిగువన ఉన్నవాగులోకి 1800 క్యూసెక్కుల వరద నీటిని వదులుతున్నారు. అలాగే గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 1.852 టీయంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 0.762 టీయంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 20 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రూపంలో వచ్చి చేరుతుందని అధికారులు చెబుతున్నారు. మొత్తానికి ప్రాజెక్టుల ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రాజెక్టుల్లోకి వరద నీరు చేరుతుండడంతో జలకళను సంతరించుకున్నాయి. అలాగే ఖానాపూర్ సమీపంలోని పాత సదర్‌మాట్ ఆనకట్ట వరద నీటితో నిండుకుండను తలపిస్తోంది.

జిల్లా సగటు వర్షపాతం 27.2 మిల్లీ మీటర్లు

జిల్లాలో గురువారం నమోదైన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లా సగటు వర్షపాతం 27.2 మిల్లీ మీటర్లుగా నమోదు కాగా జిల్లాలో అత్యధికంగా సారంగాపూర్ మండలంలో 38.2 మిల్లీ మీటర్ల నమోదైంది. అలాగే లోకేశ్వరం మండలంలో 36.2 మిల్లీ మీటర్లు, భైంసా మండలంలో 35.2 మిల్లీమీటర్లు, కుభీర్ మండలంలో 34.4 మిల్లీమీటర్లు, కడెం మండలంలో 31.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే బాసర మండలంలో 29.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా ముథోల్, కుంటాలలో 28.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే దిలావర్‌పూర్ మండలంలో 24.4 మిల్లీమీటర్లు, నిర్మల్ మండలంలో 29.2 మిల్లీమీటర్లు, నిర్మల్ రూరల్ మండలంలో 26.2 మిల్లీమీటర్లు, మామడ మండలంలో 28.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యల్పంగా నర్సాపూర్ (జి) మండలంలో 4.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.


స్తంభించిన రాకపోకలు

జిల్లాలో గత ఐదారు రోజులు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పెంబి మండలంలోని కడెం,దొత్తి వాగు, అలాగే కడెం మండలంలోని చిక్‌మాన్ వాగు పొంగి ప్రవహిస్తున్నది. దీంతో పెంబి మండలంలోని రాంనగర్, యాపల్‌గూడ, అర్జున్ తాండ, తులసీపేట, ఎంగ్లాపూర్, గుమ్మెన, దొంధారి, రాయధారి, పోచంపెల్లి, పస్పుల్లాతో పాటు తదితర గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. దీంతో గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అతి కష్టం మీద వాగులను దాటే పరిస్థితి నెలకొంది. అలాగే కురుస్తున్న వర్షాలకు రోడ్లన్ని బురదమయంగా మారిపోయాయి. రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బంగాళఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే మూడు నాలుగు రోజులు మరిన్ని వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించిన నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలి. కడెం, స్వర్ణ ప్రాజెక్టులకు భారీగా వరద నీరు రావడంతో గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు వదులుతున్నారు. ఆయా ప్రాజెక్టుల కింద పరివాహక ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇంటికే పరిమితం కావాలి. రైతులు తమ పశువులను కూడా ఇంటి వద్దనే కట్టివేయాలి.

- జానకీషర్మిల, జిల్లా ఎస్పీ



కడెం ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తి గోదావరిలోకి నీరును విడుదల చేస్తున్న దృశ్యం

స్వర్ణ ప్రాజెక్టు గేటు ఎత్తివేత



స్వర్ణప్రాజెక్టు గేటు ద్వారా వరద నీరును వదిలిపెట్టిన దృశ్యం

సారంగాపూర్ రూరల్, జూలై 5 : మండలంలో గల స్వర్ణప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో గత నాలుగు రోజుల నుండి కురిసిన భారీ వర్షానికి స్వర్ణ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్టు మొత్తం నీటి సామర్థ్యం 1183 అడుగులకు గాను 1181 అడుగుల వరదనీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు గేటును ఎత్తి 1810 క్యూసెక్కుల వరదనీరును దిగువ ప్రాంతానికి వదిలిపెట్టారు. ప్రస్తుతం 2700ల క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. అలాగే స్వర్ణవాగు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు తెలిపారు.

స్వర్ణ ప్రాజెక్టును పరిశీలించిన ఎస్పీ



స్వర్ణ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్పీ

సారంగాపూర్, జూలై 25 : మండలంలో గల స్వర్ణ ప్రాజెక్టును గురువారం ఎస్పీ షర్మిల జానకి పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకొని దిగువ ప్రాంతానికి వరద గేట్ల ద్వారా నీరును విడుదల చేసే సమయంలో ప్రజలకు ముందుస్తు సమాచారాన్ని అందించాలని ఇరిగేషన్ అధికారులతో పేర్కొన్నారు. ఈమె వెంట ఎస్సై శ్రీకాంత్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

జలాశయాలకు భారీగా చేరుతున్న వరద నీరు



లింగోజీ చెరువులోకి చేరుతున్న వరద నీరు

దిలావర్‌పూర్, జూలై 25 : ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి మండలంలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. వారం రోజులుగా ముసురు పడుతోంది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని సన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో దిలావర్‌పూర్‌లోని లింగోజీ చెరువు, టెంబుర్నిలోని పెద్ద చెరువులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఇప్పటికే దిలావర్‌పూర్‌లోని కొత్త చెరువు, బ్రాహ్మణి చెరువు, మాల చెరువు నిండు కుండలా మారాయి. వర్షాలు ఇలాగే కురుస్తే అలుగు ఎత్తి పోస్తాయని గ్రామస్తులు పేర్కొన్నారు. కగా ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో కొంతమంది చేపలు పట్టేందుకు ప్రయత్నిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. చేపల కోసం వాగుల్లో, చెరువుల్లో దిగవద్దని, ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే ప్రమాదముందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

41 మంది బాధితులకు ఫోన్లు అప్పగింత : ఎస్పీ



ఫోన్లు అందజేసిన ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, జూలై 25 : సెల్‌ఫోన్ పోగొట్టుకున్న 41 మంది బాధితులకు సీఈఐ ఆర్‌యాప్ ద్వారా ట్రేస్ చేసి గురువారం అందజేసినట్లు ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె ఫోన్లు అందజేసి మాట్లాడుతూ.... సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫోన్ పోయినట్లు నమోదు చేసుకుంటే తిరిగి వాటిని పొందే అవకాశం ఉందన్నారు. పోర్టల్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు 809 సెల్‌ఫోన్లు కోల్పోయినవారికి అందజేశామన్నారు. డీఎస్పీ గంగా రెడ్డి, ఆర్ఎస్సై రవి, ఐటీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు. ఐటీ కోర్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

అడవిలో తప్పిపోయిన గొర్రెల కాపరి

- కాపాడిన పోలీసులు



గుండ శ్రీనివాస్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై శంకర్, సిబ్బంది

దస్తురాబాద్ రూరల్, జూలై 25 : అసలే కవ్వాల్ అభయారణ్యంలోని కారడవి. వర్షాకాలం కావడంతో పచ్చని ప్రకృతి దట్టమైన అటవీగా మారిపోయింది. ఆపై భారీవర్షం కురుస్తుంది. రోజులాగే మండల కేంద్రానికి చెందిన గుండ శ్రీనివాస్ అనే గొర్రెల కాపరి కారడవిలో తప్పిపోయిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై శంకర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన గుండ శ్రీనివాస్(47) బుధవారం ఉదయం పది గంటల ప్రాంతంలో తనకు చెందిన గొర్రెలను మేపటానికి మండల కేంద్రం సమీపంలోని కవ్వాల్ అభయారణ్యంలోకి వెళ్లారు. ప్రతిరోజు లాగే గొర్రెలను మేపుకొని ఇంటికి వస్తారని కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. చీకటి పడడంతో గొర్రెల కాపరి ఎంతకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులులలో ఆందోళన మొదలైంది. దీంతో వారు వెంటనే సుమారు 9 గంటల ప్రాంతంలో 100 డయల్‌కి సమాచారాన్ని అందించారు. కుటుంబికులు పోలీస్ స్టేషన్ చేరుకొని అడవిలో తప్పిపోయిన గుండ శ్రీనివాస్ వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి వెంటనే రంగంలోకి దిగారు కుటుంబ సభ్యులు, తోటి గొర్రెల కాపరి తెలిపిన వివరాల ప్రకారం కవ్వాల్ అభయారణ్యంలోకి రాత్రి సమయంలో విధులు నిర్వహిస్తున్న శ్రావణ్, సురేందర్ అనే ఇద్దరు కానిస్టేబుళ్లతో గ్రామానికి చెందిన యువకులతో మండలంలోని ఆకొండపేట్, కల్లెడ గ్రామాల పరిధిలోని అడివి ప్రాంతంలోకి వెళ్లి వెతికారు. జన్నారం మండలం నరసింగాపూర్ అనే ఆదివాసి గూడానికి చేరుకున్న పోలీసు బృందానికి గ్రామం సమీపంలో ఉదయం గొర్రెలు కనిపించాయని ఆదివాసులు సమాచారం అందించడంతో పోలీసు బృందాలు అందరినీ అప్రమత్తం చేశారు. ఆ గ్రామ సమీపంలోనే వెతకడంతో అటవీ ప్రాంతంలో ఓ బండరాయిపై తప్పిపోయిన వ్యక్తి కనిపించారు. దీంతో మిగతా బృందాలను గాలింపు ఆపి సంఘటన స్థలానికి రావలసిందిగా సమాచారం అందించడంతో పోలీసు బృందాలు అక్కడికి చేరుకొని బాధితులను అడవి ప్రాంతం నుంచి బయటకు తీసుకొచ్చి ఆహారం, నీటిని అందించారు. వెనువెంటనే కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు బాధితుడిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి కుటుంబ సభ్యులకు అందించారు. పోలీసులు వ్యవహరించిన తీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కేవలం కొన్ని గంటల్లో మిస్సింగ్ కేసులు చేధించారు.

ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, జూలై 25 : ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల, డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులతో ధరణి, ప్రభుత్వ స్థలాల రక్షణ, వివిధ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారం, మండలాల వారీగా వివిధ దరఖాస్తులు, ఇప్పటివరకు పరిష్కరించినవి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా అవసరమైన రక్షణచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు, చెరువు భూములను కబ్జా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైన దృష్ట్యా విద్యార్థులకు ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలని, అలాగే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందజేయాలని సూచించారు. ధరణి దరఖాస్తులు, వివిధ మాడ్యూల్స్, సెపన్స్, కోర్టు కేసులు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, కలెక్టరేట్, ఏవో సూర్యారావు, తహసీల్దార్లు, ఈడీఎం నదీం, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలి

- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్, జూలై 25 : సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి మంగళ, శుక్రవారాల్లో తప్పనిసరిగా డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కాలానుగుణ వ్యాధులైన డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పకడ్బందీగా పారిశుధ్యాన్ని నిర్వహించాలన్నారు. దోమలు వ్యాపించకుండా ఉండేందుకు అన్ని ప్రాంతాలలో ఫాగింగ్ నిర్వహించి, దోమ నివారణ రసాయనాలను పిచికారి చేయాలని ఆదేశించారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో ఆయిల్ బాల్స్ వేసి దోమల వృద్ధిని అరికట్టాలన్నారు. వర్షాలు అధికంగా కురుస్తున్నందున రోడ్లు బాగాలేని గ్రామాల్లో ప్రసవాలకు దగ్గరగా ఉన్న మహిళలను గుర్తించి వారిని బర్త్ వెయిటింగ్ రూమ్‌లకు తరలించాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి వాటిని ఖాళీ చేయించాలని ఆదేశించారు. పిచ్చి మొక్కలు, పొదలను తొలగించి, నీరు నిల్వ ఉండకుండా గుంతలను పూడ్చాలన్నారు. కుక్కకాటుకు గురైన ప్రతి ఒక్కరికీ యాంటీ రెబిస్ టీకాను వేయించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో ధనరాజ్, జడ్పీ సీఈవో గోవింద్, డీఈవో రవీందర్ రెడ్డి, పంచాయతీ రాజ్, వైద్యశాఖ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేటర్ కార్యక్రమంపై అవగాహన కల్పించండి

నిర్మల్ కల్చరల్ : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటా ఇన్నోవేటర్ కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాస్థాయి అధికారులతో జూమ్ సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల నుంచి నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇన్నోవేటర్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. సమస్యల పరిష్కారానికి నూతన ఆవిష్కరణలు తయారు చేసేలా గ్రామీణ యువతను ప్రోత్సహించాలన్నారు. ప్రతి మండలం నుండి నూతన ఆవిష్కరణలను ఆగస్టు 3లోగా 9100678543 నెంబర్‌కు ఫోటోలతో సహా పంపించాలని ఆదేశించారు. 15న కలెక్టరేట్‌లో ప్రదర్శన ఉంటుందన్నారు. ఉత్తమ ఆవిష్కరణలు ఎంపిక చేసి బహుమతి అందజేసి ప్రోత్సహిస్తామని తెలిపారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రతినిధులు, ఇతర అధికారులు జూమ్ మీటింగ్ నిర్వహించారు. డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఏవో అంజిప్రసాద్, డీఈవో రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీటి వినియోగం, పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి

ప్రతి ఒక్కరు నీటి వినియోగం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. గురువారం అప్కాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారి ధనరాజ్, కమిషనర్ రాజు, మెప్మా పీడీ సుభాష్, అప్కాస్ ప్రతినిధులు శ్రీనివాస్, మురళి, బ్రహ్మచారి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఇథనాల్' వ్యతిరేక రిలే దీక్షలు

దిలావర్‌పూర్, జూలై 25 : ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం జోరున వర్షం కురుస్తున్నా... వర్షంలో యువకులు నిరసన దీక్ష చేశారు. ఇథనాల్ పరిశ్రమ రద్దయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక కమిటీ ప్రకటించింది. అయితే కొంత మంది ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నిస్తుండటాన్ని తీవ్రంగా ఖండించింది. ఇథనాల్ పరిశ్రమకు ఎవరు మద్దతు ఇచ్చిన భవిష్యత్తులో వారికి పుట్టగతులు లేకుండా చేస్తామని హెచ్చరించింది. యువతతో పెట్టుకోవద్దని సూచించింది. రాజకీయాలకు అతీతంగా ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరింది.

బీసీఏ లో చేర్చాలని ముదిరాజ్‌ల వినతి

కుభీర్, జూలై 25 : తమను బీసీడీ కేటగిరి నుండి బీసీఏలోకి చేర్చాలని కోరుతూ గురువారం ముదిరాజ్ కులస్థులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

కొనసాగుతున్న వరుణుడి జోరు

భైంసా, జూలై 25 : డివిజన్ పరిధిలో వరుణుడి జోరు కొనసాగుతోంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న ముసురు వానలతో పంటల సాగుకు పూర్తి స్థాయి అనుకూలమైన వాతవరణం ఏర్పడింది. చెరువులు,కుంటలలోకి వర్షపు నీరు అధిక మొత్తంలో వచ్చి చేరుతోంది. వాగులు, వంకల్లో ప్రవాహ జోరు పెరిగింది. గురువారం డివిజన్ పరిధిలో 32 మి.మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. లోకేశ్వరం మండలంలో 36.2 మి.మీటర్లు, భైంసా మండలంలో 35.2 మి.మీటర్లు, కుభీర్ మండలంలో 34.4 మి.మీటర్లు, బాసర మండలంలో 29 మి.మీటరుల, కుంటాల మండలంలో 28.4 మి.మీటర్లు, ముథోల్ మండలంలో 28.2 మి.మీటర్లు, తానూర్ మండలంలో 26.8 మి.మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది.ఇక మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. పంటచేలలో అధికంగా వర్షపు నిలువడంతో సాగులోనున్న వివిధ రకాల పంటల పైర్లు నీట మునిగాయి. కాగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న ముసురు వానలతో జనజీవనం స్తంభించిపోయింది.

సంక్షిప్త సమాచారం

రోడ్డుపై నాట్లు వేసి నిరసన



ముథోల్, జూలై 25 : మండల కేంద్రమైన ముథోల్ నుండి ఆష్ట వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో గురువారం స్థానిక యువకులు రోడ్డుపై నాట్లు వేసి నిరసన వ్యక్తపరిచారు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని వారు వాపోయారు. ఈ రోడ్డు గుంతలమయంగా మారి ఈ వర్షంతో భారీ స్థాయిలో నీళ్లు నిలిచి ఉంటున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు గురించి నాయకులు, అధికారులు పట్టించుకోవటం లేదని వారు ఆరోపించారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని వారు కోరారు.

పెన్షనర్లకు నేడు ఉచిత కంటి పరీక్షలు

నిర్మల్ కల్చరల్, జూలై 25 : జిల్లాలోని పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు సంఘ భవనంలో ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అవసరమైన వారికి హైదరాబాద్ గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు శస్త్ర చికిత్సలు చేస్తారని తెలిపారు.

సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు

ముథోల్, జూలై 25 : జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్ పొందుటకు తేదీలను జిల్లా సమన్వయ అధికారి ఆర్. ప్రశాంత్ ప్రకటించినట్లు ముథోల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. లెఫ్ట్ పోచంపాడ్, జామ్, కడెం, భైంసా బాలికల కళాశాలలో స్పాట్ అడ్మిషన్ పొందుటకు ఈ నెల 26న ఉదయం 10 గంటలకు టీజీ ఎస్ డబ్ల్యూఆర్ఎస్ జేసీజీ ధర్మారంలో, బాలుర సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల జూనియర్ కళాశాల ముథోల్‌లో స్పాట్ అడ్మిషన్స్ పొందుకుట టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ జేసీ బి బిక్కునూర్ గురుకుల పాఠశాల నందు హాజరు కాగలరని తెలిపారు. ఎస్ఎస్‌సీ 2024 లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో సకాలంలో హాజరు కాగలరని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీదే గెలుపు

సారంగాపూర్, జూలై 25 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థులే గెలుపొందుతారని రాష్ట్ర బీజేపీ నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. గురువారం మండలంలో గల కరుణాకర్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మండల బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారే తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కరిపే విలాస్, రాంశంకర్‌రెడ్డి, వడ్డీ రాజేందర్‌రెడ్డి, సాహెబ్‌రావు, గంగారెడ్డి, బడి పోతన్న, రాజేశ్వర్‌లతో పాటు నాయకులు ఉన్నారు.

హాకీ సెంటర్‌కు జిల్లా విద్యార్థుల ఎంపిక

ఆదిలాబాద్ అర్బన్, జూలై 25:జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనసాగే వనపర్తి హాకీ సెంటర్‌కు ఎంపిక కావడం అభినందనీయమని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదిలాబా ద్‌లోని కోలాం ఆశ్రమ పాఠశాలకు చెందిన మడావి ప్రసాద్, కుర్సంగేదను కుమార్‌లు వనపర్తి హాకీ సెంటర్‌కు ఎంపికైన సందర్భంగా పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

● చాకచక్యంగా పట్టుకున్న ఉట్నూర్ పోలీసులు
● రూ.లక్ష విలువ గల గంజాయి స్వాధీనం

ఉట్నూర్, జూలై 25: ఉట్నూర్ ప్రాంతం నుంచి గంజాయి తరలించే ముఠాను అరెస్టు చేసినట్లు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ తెలిపారు. ఉట్నూర్‌లోని సబ్‌డివిజన్ పోలీసు కార్యాలయంలో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. బుధవారం సాయంత్రం మండలంలోని లింగోజి తండా ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలో నలుగురు వ్యక్తులు తెల్ల సంచితో అనుమానాస్పదంగా కనిపించారని, వారిని విచారించి వారి వద్ద ఉన్న 4 కిలోల 82 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ రూ.లక్షకుపైగా ఉందని చెప్పారు. ఉట్నూర్‌కు చెందిన తవరే బాలాజి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు దురువంశీ సాయి, బండారి గణేష్‌లు గంజాయిని ఆంధ్రప్రదేశ్ నుంచి అమ్మడానికి తీసుకురాగా ఇంద్రవెల్లికి చెందిన శేఖవా త్ గోవింద్ వారిని రిసీవ్‌చేసుకుని నలుగురు కలిసి శ్యాంపూర్ వైపు వెళ్తుండగా పోలీసులు వారిని పట్టుకున్నారన్నారు. పంచనామ అనంతరం నలుగురు వ్యక్తులను, పట్టుకున్న గంజాయిని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి వారి పై సీఐ గండికోట మొగిలి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారన్నారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన ఎస్సై మనోహర్, సిబ్బందిని డీఎస్పీ నాగేందర్ అభినందించారు. ఈ సమావేశంలో ఉట్నూర్ సీఐ మొగిలి, ఉట్నూర్ ఎస్సై మనోహర్, ఇంద్రవెల్లి ఎస్సై దుబ్బాక సునిల్, పోలీసు సిబ్బంది దాదరావు, లక్ష్మీనారాయణ, మునీరుద్దీన్‌లు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేందర్

నిజాయితీ చాటిన ఆర్టీసీ సిబ్బంది

నిర్మల్, జూలై 25 : నిర్మల్ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ అఫ్రోజ్ తన బస్సులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు ఫోన్ మరిచిపోగా దాన్ని నిజాయితీగా అందించి నిజాయితీ చాటుకున్నారు. బుధవారం హైదరాబాద్ నుండి నిర్మల్‌కు ప్రయాణించి 25 వేల విలువగల ఫోన్ బస్సులో మరిచిపోయాడు. డ్రైవర్ గమనించి ఫోన్ కంట్రోలర్‌కు అందజేశారు. ప్రయాణికుడికి ఫోన్ చేయగా బోథ్ గ్రామానికి చెందినట్లు గుర్తించి సమాచారం అందజేశారు. బస్ డిపోకు పిలిపించి అతనికి ఫోన్ అందజేశాడు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఈ సందర్భంగా నిజాయితీ చాటిన డ్రైవర్‌ను అభినందించారు.

నిర్మల్ టౌన్ : నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లు నిజాయితీని చాటుకున్నారు. నిజామాబాద్ నుంచి నిర్మల్ వస్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు సురేష్ రూ. రెండు లక్షల బ్యాగు మరిచిపోయి బస్సు దిగి వెళ్లిపోయాడు. నిర్మల్ డిపోకు చెందిన టీఎస్ బస్సు డ్రైవర్ తాజొద్దీన్, కండక్టర్ వైఎల్. రాజులు బ్యాగును గమనించి ఆ బ్యాగును బస్ డిపోకు తీసుకొని వచ్చి తెరిచి చూడగా డబ్బుల కట్టలు ఉన్నాయి. బ్యాగులో ఉన్న సమాచారం ప్రకారం ప్రయాణికుడు సురేష్‌ను బస్ డిపోకు పిలిపించి డ్యూటీ డ్రైవర్ తాజొద్దీన్, కండక్టర్ వైఎల్. రాజు వారి డబ్బులను అందజేయగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసి స్టెంట్ మేనేజర్ ఐ. రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం సురక్షితం

నిర్మల్ టౌన్, జూలై 25 : ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రమాదరహిత వారోత్సవాలకు ముఖ్యఅతిథిగా నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మాట్లాడుతూ... ఈ ప్రమాద రహిత వారోత్సవాలు 24 జూలై నుంచి 30 జూలై వరకు నిర్వహిస్తామని, డ్రైవర్లు డ్యూటీకి వెళ్లేటప్పుడు మంచి కండీషన్‌తో బస్సులు అప్పజెప్పాలని మెకానిక్‌లకు సూచించారు. వర్షాకాలం తగు సూచనలు తీసుకొని బస్సులు నడపాలని, రోడ్డుపై స్కిడ్ అయ్యే పరిస్థితులు ఉంటాయి. బస్సులు అప్రమత్తంగా నడపాలని, పూర్తి ప్రశాంతతో బస్సులు నడపాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎం. నవీన్‌కుమార్, సూపర్‌వైజర్లు, మెకానిక్‌లు, డ్రైవర్‌లు, కండక్టర్‌లు పాల్గొన్నారు.

'సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి'

నిర్మల్‌కల్చరల్, జూలై 25 : బీజేపీ సభ్యత్వ కార్యక్రమం విజయవంతం చేయాలని ఆ పార్టీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పట్టణ అధ్యక్షుడు సాధం అరవింద్ అధ్యక్షతన కొనసాగిన సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రామీణ స్థాయిలో పార్టీని పటిష్టపర్చాలని భూమయ్య కోరారు. ప్రజల సమస్యలపై పోరాడాలన్నారు. బీజేపీ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి పార్టీ వైపు ఆకర్షితులను చేయాలని, వారికి అండగా ఉండాలని సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్లు బిట్లింగ్ నవీన్, ఎడపల్లి నరేందర్, ప్రధాన కార్యదర్శి రామోజీ నరేష్, అల్లం భాస్కర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఊడిపడిన పాఠశాల పైకప్పు పెచ్చులు

లక్ష్మణచాంద, జూలై 25 : పాఠశాల పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో చదువులకు అంతరాయం ఏర్పడిన ఘటన మండలంలోని తిరుపెల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎప్పటిలాగే పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు పైపెచ్చులు ఊడి పడుతున్న దృశ్యాలు కంటపడటంతో భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలిసిన బీజేపీ నాయకులు గాండ్లచిన్నయ్య, గ్రామస్తులు వెళ్లి పరిశీలించారు. పైకప్పు ఉరవటం కారణంగా పాఠశాల గది మొత్తం పూర్తిగా తడిచి పాఠాలు చెప్ప లేని పరిస్థితి ఎదురైంది. అయోమయానికి గురైన విద్యార్థులు ఇంటికి పయనమయ్యారు.


ఎట్టకేలకు యువకుడి మృతదేహం లభ్యం

ఉట్నూర్, జూలై 25 : ఉట్నూర్ మండలంలోని గంగాపూర్ వాగులో గల్లతయిన యువకుడు టేకం లక్ష్మణ్(28) శవం ఐదు రోజుల అనంతరం ఎట్టకేలకు లభించడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.గత శనివారం రాత్రి బొప్పరికుంటకు చెందిన టేకం లక్ష్మణ్, తన గ్రామస్థుడితో కలిసి ఇంటికి వెళ్లే దారిలో ఉన్న గంగాపూర్ చెక్‌డ్యాం పైనుంచి ఇంటికి వెళ్త ఇద్దరు వరద నీటిలో పడిపోయి ప్రమాదానికి గురికాగా ఆయన వెంట ఉన్న మరో వ్యక్తి రాజు వరద నీటిని బయటపడి ఆ రాత్రికి అక్కడే ఉన్న ఓ గుడిసెలో తలదాచుకొని ఆదివారం ఉదయం గ్రామస్థులకు సంఘటన గురించి తెలియజేయడంతో గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో సీఐ గండికోట మొగిలి, ఎస్సై మనోహర్, ఏఎస్సై దిలీప్‌ల ఆధ్వర్యంలో ఐదు రోజులుగా గత ఈతగాళ్లతో గాలింపు చర్యలు నిర్వహించారు. వరద నీటి ప్రవాహానికి తోడు ఏకతాటిగా వర్షం కురుస్తుండడంతో గాలింపు చర్యలకు విఘాతం కలిగింది. గురు వారం ఉదయం తిరిగి గాలింపు నిర్వహిస్తుండగా చెట్టుకు శవం తట్టుకుని కుళ్లిపోయి ఉందని గమనించారు.ఎట్టకేలకు శవాన్ని బయటకు తీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 26.8 • కనిష్ఠం 23.2



ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

శుక్రవారం 26 జూలై 2024

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిరికొండ, జూలై25: సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై రమేష్ సూచించారు. రాజంపేట్‌లో పోలీసులు అవగాహనా సదస్సు నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల రైతులకు రైతుబంధు, రుణమాఫీ డబ్బులు వేస్తామంటూ ఫోన్ చేసినా, లింకులు పంపినా స్పందించవద్దన్నారు. అలాగే ఏకదాటిగా కురుస్తున్న వర్షాలతో వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, ఆదివాసీలు బయటకు రాకుండా అప్రమత్తంగా ఉండాలని కార్యక్రమంలో పోలీసులు, గ్రామ పటేల్ పెందూర్ బండు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బడుగు జీవులకు భరోసా!

» వ్యవసాయరంగం కూలీలకు పెద్దపేట » ప్రత్యేకంగా కనిపించని జిల్లా ప్రస్థావన
» ఆరు గ్యారంటీల అమలుకు భారీగా నిధులు » నెరవేరనున్న పేదోడి ఇందిరమ్మ ఇంటి కల
» రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లాలో మిశ్రమ స్పందన

ఆదిలాబాద్, జూలై25 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల తర్వాత తిరిగి అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారిగా వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. గురువారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షికబడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లుభట్టివిక్రమార్క శాసనసభలో ప్రవేశ పెట్టారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడుగుజీవులకు భరోసాను కల్పించేలా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అప్పులపాలైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతు అన్నివర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు కనిపించింది. మొత్తం రాష్ట్ర వార్షిక బడ్జెట్ రూ.2లక్షల 91వేల 159 కోట్లు కాగా, ఇందులో ప్రధానంగా వ్యవసాయరంగానికి రూ.72వేల659 కోట్లు భారీగానిధులు కేటాయించారు. అలాగే దళిత సంక్షేమానికి రూ.33వేల124 కోట్లు, గిరిజన సంక్షేమానికి రూ.17వేల 56కోట్లు, బీసీ సంక్షేమానికి 9200 కోట్లు, వైద్యం, ఆరోగ్యం రూ.11వేల 468 కోట్లు, నీటిపారుదల శాఖకు రూ.22వేల 301 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2418కోట్లు, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పథకానికి రూ.723కోట్లు, మహిళా శక్తి క్యాంటిన్‌లు రూ.50.41కోట్లను కేటాయించారు. అయితే ఇటీవల ఉట్నూర్‌లో రైతుభరోసా పేరిటా పర్యటించిన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క జిల్లాకు భారీగా నిధులు మంజూరు చేస్తారని అందరూ భావించారు. కానీ ఆశించినస్థాయిలో నిధులు కేటాయించ లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు, మత్స్యకారుల భరోసా, గొల్లకుర్మలకు గొర్రెల పంపిణీ, మహిళ సంక్షేమం, షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకం ద్వారా తులం బంగారంపై స్పష్టత ఇవ్వలేక పోయిందన్న టాక్ విన్పిస్తోంది. రాష్ట్రబడ్జెట్‌లో ప్రత్యేకంగా జిల్లా ప్రస్థావన లేకపోవడంతో జిల్లావాసులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఎన్నికలసమయంలో బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామం నుంచి పాదయాత్రను ప్రారంభించిన భట్టివిక్రమార్క జిల్లా సమస్యలపై ప్రత్యేక దృష్టిని సారించ లేకపోయారన్న వాదనలు వినిపిస్తున్నాయి. మొత్తానికి రాష్ట్ర వార్షిక బడ్జెట్ పై జిల్లాలో మిశ్రమ స్పందన కన్పిస్తోంది.

• అన్నదాతకు అండ దండా..

అన్నదాతలకు అండగా నిలిచేందుకు రాష్ట్రప్రభుత్వం బడ్జెట్‌లో భారీగా నిధులను మంజూరుచేసింది. వ్యవసాయశాఖకు పెద్దపీట వేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు వార్షిక బడ్జెట్‌లో రూ.72వేల 659 కోట్ల నిధులను కేటాయించింది. ఇప్పటికే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ పేరిటా తొలివిడతను విడుదల చేసింది. రూ.లక్షలోపు రుణాలను మంజూరు చేస్తూనిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలోని 18వేల 821 మంది రైతులకు గానూ రూ.120కోట్ల 79లక్షల నిధులను విడుదల చేశారు. అలాగే విడతల వారీగా 2లక్షల లోపు పంటరుణాలను మాఫీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన రైతుబంధు పథక పరిమితిని ఎకరాన రూ.15వేలకు పెంచుతు రైతుభరోసా పేరిటా పెట్టుబడి సహాయాన్ని అందించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే జిల్లాలో రైతు అభిప్రాయసేకరణను కూడా పూర్తి చేశారు. త్వరలోనే రైతుభరోసాను అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే రైతు కూలీలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్ నుంచే సన్నరకాల వరి ధాన్యానికి రూ.500ల బోనస్‌ను ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కానీ జిల్లాలో వరిపంట సాగు కనిష్ఠ స్థాయిలో ఉంటుంది. దీంతో జిల్లా రైతులకు పెద్దగా ప్రయోజనం ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికంగా సాగుచేసే పత్తి, సోయా, కంది పంటలకు బోనస్ ప్రకటించి ఉంటే జిల్లా రైతులకు ఎంతో మేలు జరిగి ఉండేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

• జిల్లాకు దక్కని ప్రాధాన్యత

రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాగాపేరున్న ఆదిలాబాద్‌కు రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో ప్రత్యేకంగా ప్రాధాన్యతనిచ్చినట్లు కనిపించలేదు. ఎన్నోఏళ్లుగా దీర్ఘకాలిక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. జిల్లా ప్రస్థావన లేకపోవడంపై జిల్లా వాసులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కోర్టా చనకా ప్రాజెక్టుతో పాటు కొత్తగా నిర్మించే కుప్టి ప్రాజెక్టు ప్రస్థావన కనిపించ లేదు. అలాగే సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణపై ఊసెత్తక పోవడం కార్మిక వర్గాల్లో అసంతృప్తికి కారణమైంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపడుతున్న ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణ పనులకు నిధుల కేటాయింపు, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నత విద్య అవకాశాలను కల్పించేందుకు గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు కనిపించ లేదు. విద్య, వైద్య, ఉపాధి కల్పనలో జిల్లాకు పెద్దగా ప్రాధాన్యతను ఇవ్వకపోవడంపై జిల్లా వాసులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

• సంక్షేమ పథకాలకు పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు భారీగా నిధులను మంజూరు చేస్తూ పెద్దపీఠ వేసినట్లు కన్పిస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ఇప్పటికే మహాలక్ష్మి, గృహజ్యోతి, రాజీవ్‌ఆరోగ్యశ్రీ లాంటి పథకాలను అమలుచేస్తోంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలందరికీ ఉచితబస్సు ప్రయాణాన్ని కల్పించింది. అలాగే గృహజ్యోతి పథకం కింద జిల్లాలో 93వేల 427 మంది అర్హులు కాగా, ఇప్పటివరకు 84వేల 409మంది లబ్ధిదారులకు జీరో బిల్లును అమలుచేసిందిన దీనికి సంబంధించిన రూ.3కోట్ల 47లక్షల నిధులను విద్యుత్‌శాఖకు ప్రభుత్వం చెల్లించింది. అలాగే రూ.500లకే గ్యాస్‌సిలిండర్‌ను అందిస్తోంది. ఆరు గ్యారంటీల అమలుకు బడ్జెట్‌లో గృహజ్యోతి పథకానికి రూ.2వేల 418కోట్లు, గ్యాస్ సిలిండర్ సబ్సిడీపథకానికి రూ.723 కోట్లు, మహిళా సాధికారతే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహిళా శక్తి క్యాంటిన్‌లకు రూ.50.41కోట్లను కేటాయించింది. ఇందులో భాగంగా జిల్లాలో మహిళా క్యాంటిన్‌లను అధికారులు మంజూరుచేశారు. బోథ్‌లోని పొచ్చెర, ఉట్నూర్‌లోని కొమురంభీం కాంప్లెక్స్, ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో రిమ్స్ ఆసుపత్రి, మావల అర్బన్ పార్కులో మహిళా శక్తి క్యాంటిన్‌లను ఏర్పాటుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో మహిళా స్వయం సహాయక సభ్యులకు బ్యాంకు రుణాలను ఇప్పించి స్వయం ఉపాధిని కల్పించనున్నారు.

• ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

గతంలో మాదిరిగా మళ్లీ అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో నిధులను కేటాయించారు. ఈ పథకం ద్వారా నిరుపేదలకు రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేయనున్నారు. అలాగే ఎస్సీఎస్టీ లబ్ధిదారులకు రూ.6లక్షలను చెల్లిస్తారు. ఈయేడు ప్రతీ నియోజక వర్గానికి 3500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో డబుల్‌బెడ్‌రూం పథకాన్ని అమలు చేసిన ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. ఈ పథకం తీవ్ర విమర్శలకు దారి తీసింది. దీంతో అర్హులైన వారందరికి ఇందిర్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. సొంతంగా స్థలం కలిగి ఉన్న వారందరికి ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. గతంలో 3,800 డబుల్ బెడ్‌రూం ఇళ్లను జిల్లాకు మంజూరు చేయగా కేవలం 518 ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తయ్యింది. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ఇప్పటికే 718 మంది లబ్ధిదారులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. కానీ ఇప్పటివరకు ఏ ఒక్కరికి డబుల్‌బెడ్‌రూం ఇంటిని కేటాయించిన దాఖలాలు లేవు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పైననే నిరుపేద లబ్ధిదారులు భారీ ఆశలు పెట్టుకుంటున్నారు.

జిల్లాకు మొండిచేయి చూపిన రాష్ట్రబడ్జెట్



• జోగురామన్న (మాజీ మంత్రి)

రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయే కన్పించింది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలను ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ హామీలను అమలు చేయడంలో విఫలమైంది. జిల్లావాసులకు ఎలాంటి భరోసాను ఇవ్వలేకపోయింది. ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేసేలా బడ్జెట్ కనిపించ లేదు. ప్రజాపాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. దళితబంధు, రైతుబంధు, రైతుబీమా, మత్స్యకారుల భరోసా, యాదవులకు గొర్రెల పంపిణీ, మహిళా సంక్షేమం, షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకాలపై స్పష్టతను ఇవ్వలేక పోయారు.

అన్నివర్గాలను మెప్పించే బడ్జెట్ ఇది..



• కంది శ్రీనివాస్‌రెడ్డి (నియోజకవర్గ ఇన్‌చార్జీ, ఆదిలాబాద్)

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి వార్షిక బడ్జెట్ అన్నివర్గాలను మెప్పించేలా ఉంది. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వడంతో జిల్లా రైతులకు ఎంతో మేలు జరగనుంది. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు సరిపడా నిధుల కేటాయింపు జరిగింది. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని కోర్టా చనకా ప్రాజెక్టును పూర్తిచేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకదృష్టిని సారించింది. యేడాది లోపే ఈ ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

జిల్లాకు ఒరిగిందేమీ లేదు..



• పాయలశంకర్ (ఎమ్మెల్యే, ఆదిలాబాద్)

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్‌లో జిల్లాకు ఒరిగిందేమీ లేదు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కోతలు విధించేందుకు ప్రయత్నిస్తుంది. రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లా ప్రస్థావన లేక పోవడం బాధకరం. జిల్లాలో చెప్పుకోదగ్గ పరిశ్రమలను ఏర్పాటు చేయక పోవడంతో నిరుద్యోగ యువత ఇబ్బందుల పాలవుతున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలనే పేరు మార్చి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుంది. సంక్షేమ పథకాలకు కేంద్రం నిధులను అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తప్పుతోవ పట్టిస్తుంది. ముఖ్యంగా జిల్లా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పరిష్కారం చూపడం లేదు.

సంక్షిప్త సమాచారం

ఇంటర్ సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

బోథ్, జూలై25: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికిగాను ఒకేషనల్ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈనెల 26, 27 తేదీలో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు బోథ్ గురుకుల కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత రీజియన్ పరిధిలోని బాలికలకు ఈనెల 26న లక్షత్ పెట్‌లో, 27న బాలురకు బెల్లంపల్లిలో సీఓఈలో స్పాట్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శులు

బోథ్, జూలై 25: మండలంలోని అందుర్ గ్రామ కార్యదర్శిగా మహేష్, దేవులనాయక్‌తండా కార్యదర్శిగా శ్రీకాంత్, సోనాల గ్రామ కార్యదర్శిగా వెంకటరమణ, పార్డీబి గ్రామ కార్యదర్శిగా శ్రీనివాస్ గురువారం వారు ఎంపీడీవో కార్యాలయంలో ఆర్డర్‌తో వచ్చి బాధ్యతలు చేపట్టారు. కాగా, బాబేరా, చింతగూడ, చింతల్ బోరి, ఘన్పూర్, గుర్రాల తండా, కనుగుట్ట సాకేర గ్రామాల్లో కార్యదర్శి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ఓపీఎస్‌లతో భర్తీ చేసే అవకాశం ఉందని ఎంపీఈవో జీవన్‌రెడ్డి తెలిపారు.

ఉట్నూర్ ఎంపీడీవోగా రాంప్రసాద్ బాధ్యతల స్వీకరణ

ఉట్నూర్, జూలై 25: ఉట్నూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎన్.రాంప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ జిల్లాలోని లక్ష్మణచాందా మండల అభివృద్ధి అధికారిగా పని చేస్తూ ఉట్నూర్‌కు బదిలీపై రాగా ఇక్కడ ఉన్న ఎంపీడీఓ ఎంఎం శర్మ సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఎం శర్మతో పాటు మండల పంచాయతీ అధికారి మమేశ్‌కుమార్ ఉన్నారు.

'ఏజెన్సీలోని ఎస్సీ రైతులకు రుణమాఫీ వర్తింపచేయాలి'

నార్నూర్, జూలై 25: ఏజెన్సీలోని ఎస్సీ రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని అంబేద్కర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ లోకండే తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మాట్లాడారు. 50 ఏళ్లకుపైగా ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఎస్సీ రైతులు ప్రభుత్వ భూములను సాగుచేస్తున్నా పట్టాలు లేక సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని అన్నారు. 1970 కంటే ముందు నుంచి అప్పటి ప్రభుత్వాలు ప్రాంతంలో సాగుచేస్తున్న ఎస్సీ రైతులకు హక్కుపత్రాలతోపాటు సంక్షేమ పథకాలకు అర్హులుగా చేస్తూ వారికి సహాయం అందించిందన్నారు. 1970 తర్వాత ప్రభుత్వాలు ఆమోదించిన ఏజెన్సీ చట్టాలతో ఇక్కడి రైతులకు భూములపై నుంచిహక్కులు లేకుండా పోయాయని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుని ఏజెన్సీ ఎస్సీ రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందులో రైతులు నాందేవ్‌కోల్పేర్, విలాస్‌చాలూకర్, నాందేవ్‌జాడే, చరణ్‌దాస్‌దుర్గే తదితరులు ఉన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ



మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ రాజర్షిషా

భీంపూర్, జూలై25: మొక్కలతోనే మానవ మనుగడని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం మండలంలోని అర్లి(టి)లో జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. పాఠశాలను తనిఖీచేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం అర్లి (టి) గ్రామస్తులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని గ్రామస్తులు పలు సమస్యలను విన్నవించారు. దక్కన్ గ్రామీణ బ్యాంకును పరిశీలించారు. అంతకు ముందు భీంపూర్‌మండల కేంద్రంలో పాఠశాలను సందర్శించారు. పత్తిపంట చేనులో నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, మాజీ జడ్పీటీసీ కుంరా సుధాకర్, తహసీల్దార్ సత్యనారాయణరావు, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, మండల వ్యవసాయ అధికారి రవీందర్, ఏఈవో శంకర్, మాజీ సర్పంచ్‌లు, గొల్లి లస్మన్న, మడావి లింబాజీ, మాజీ ఎంపీటీసీ రాకేష్, రాథోడ్, ధరంసింగ్, రాథోడ్, సంతోష్, నితిన్, రుద్రగంగయ్య, అశోక్ తదితరులున్నారు.

• రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి

మండలంలోని గిరిజన గ్రామం భగవాన్‌పూర్ గ్రామస్తులు తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా వినతిపత్రం అందజేశారు. రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని విన్నవించారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

అండర్ బ్రిడ్జి ఇలా.. రాకపోకలు సాగేదెలా!



బ్రిడ్జి కింద నిలిచిన నీరు

ఆదిలాబాద్ రూరల్, జూలై25: పట్టణంలోని రైల్వేఅండర్ బ్రిడ్జి నిర్వహణ అటు పక్క కాలనీలకు శాపంగా మారింది. భారీ వర్షం కారణంగా అండర్ బ్రిడ్జి కింద మోకాళ్ల లోతుకు పైగా నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అండర్ బ్రిడ్జికి అవతలివైపు చిలుకూరి లక్ష్మీనగర్, మహాలక్ష్మీవాడ, హమాలివాడ, తాటిగూడ, క్రాంతినగర్, జైజవాన్ నగర్ కాలనీలు ఉన్నాయి. ఆ కాలనీల వాసులు నిత్యం పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. వర్షం వచ్చినప్పుడల్లా నీరు నిలిచి నానాఅవస్థలు ఎదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన డీఎల్‌ఎస్‌ఏ



వంట గదిని పరిశీలిస్తున్న అధికారి

ఆదిలాబాద్ రూరల్, జూలై25: ఆదిలాబాద్‌లోని గిరిజన గురుకుల సంక్షేమ (బాలుర) పాఠశాల, కళాశాలను డీఎల్‌ఎస్ ఏ కార్యదర్శి సౌజన్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అపరిశుభ్రత వాతావరణం, విద్యార్థులకు సౌకర్యాలు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. 2వారాల తర్వాత మళ్లీ తనిఖీ చేస్తానని నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం క్లాస్ రూమ్‌లు, వంట గది, మరుగుదొడ్లు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు.



పెన్‌గంగా నదిలో వరద ప్రవాహం

ఉప్పొంగి ప్రవహిస్తున్న పెన్‌గంగా నది

జైనథ్, జూలై25: గతరెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతంలో గల మహారాష్ట్ర భారీవర్షాల కారణంగా పెన్‌గంగా నది వరదతో ఉప్పొంగి ప్రవహిస్తోంది. అలాగే మండలంలోని మధ్యతరహ ప్రాజెక్టు అయిన సాత్నాల జలకళను సంతరించుకుంది. వర్షపు నీరు నిల్వ ఉండడంతో పత్తి, సోయా, కంది పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని మండల రైతులు వాపోతున్నారు. వర్షాల కారణంగా వ్యవసాయం పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. వర్షంతో ఆయా గ్రామాల వాగులు వంకలు జలకళను సంతరించుకున్నాయి.

• అర్లి(కె)లో వర్షానికి కూలిన రెండిళ్లు

తలమడుగు: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో జన జీవనం అతలాకుతలమవుతోంది. బుధవారం రాత్రి మండలంలోని అర్లి(కె)లో వర్షానికి రెండు పురాతనమైన ఇళ్లు కూలిపోయాయని బాధితులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో గురువారం తహసీల్దార్ రాజమోహన్ ఘటనస్థలానికి చేరుకుని కూలిన ఇళ్ల వివరాలను పరిశీలించారు. బాధితులకు నష్టపరిహారం అందించాని గ్రామస్తులు విన్నవించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చర్యలు చేపడతానని తహసీల్దార్ తెలిపారు.

చెరువులను పరిశీలించిన అధికారులు



గాజిలివాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజ్‌వీర్

తలమడుగు, జూలై 25 : గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండి ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం తహసీల్దార్ రాజమోహన్ ఎంపీడీవో చంద్రశేఖర్‌లు మండలంలోని దేవాపూర్, కజ్జర్ల రుయ్యాడి, బరంపూర్, లక్ష్మీపూర్ తదితర గ్రామ సంఘంలో గల చెరువులను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపు ప్రాంతాల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించే అవకాశం ఉన్నందున ప్రతీఒక్కరు అప్ర మత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా చెరువు ల్లో వర్షపు నీరు చేరి పొర్లి మత్తడి వద్ద నీరు బయటకు వెళ్లే అవకాశం ఉందని ఆ చుట్టూ ప్రాంతాల రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే అతిపురాతనమైన ఇళ్ల ల్లో నివసించేవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. అదేవిధంగా అతి పురాతనమైన ఇళ్లలో నివసించేవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. భారీ వర్షాలతో ఎలాంటి ప్రమాదం సంభవించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. విద్యుత్ స్తంభాల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు గ్రామాల వివరాలు తెలుసుకోవాలని కోరారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

నేరడిగొండ: వర్షాలు కురుస్తున్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ రాజ్‌వీర్ అన్నారు. గురువారం మండలంలోని గాంధారి, గాజిలి గ్రామాల నుంచి వెళ్తున్న వాగులను సందర్శించారు. వాగు ప్రవాహం ఉధృతి ఉన్నందున ప్రజలు వాగుల నుంచి దాటవద్దని సూచించారు. అనంతరం గ్రామాల్లో పర్యటించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. అలాగే గోరువెచ్చని నీరు తాగాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీఓ లక్ష్మణ్, ఈజీఎస్ ఏపీఓ వసంత్‌రావు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.